# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన 59 మంది సభ్యులకు రాజ్యసభ ఈ రోజు వీడ్కోలు పలికింది.
- ❖ దేశంలో 33 వేల 660 కోట్ల రూపాయల కేటాయింపులతో 100 ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ ఆహార భద్రతను కల్పించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.
- ❖ పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించే విషయంలో కలిసి పని చేయడానికి భారత్, యూఏఈ అంగీకరించాయి.

======================

ప్రజా సేవకు విరమణ ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యసభ 20 రాష్ట్రాలకు చెందిన 59 మంది సభ్యులకు ఈ రోజు వీడ్కోలు పలికింది. వీరిలో 9 మంది మహిళా సభ్యులు ఉన్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వారు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. రాజకీయాలకు పూర్తి విరామం ఉండదన్నారు. ఎంపీలుగా వారి అనుభవం, చేసిన సేవలు, విలువైనవిగా ఉంటాయని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

దేశంలో 33 వేల 660 కోట్ల రూపాయల కేటాయింపులతో 100 ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య)కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రివర్గ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో ఈ రోజు జరిగింది. ఆ వివరాలను కేంద్ర సమాచార,

ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు తెలియజేశారు. భవ్య పథకం ద్వారా ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ఉత్పాదక సామర్థ్యాన్ని వెలికితీయడం, దేశ వృద్ధిని ముందుకు నడిపించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా చెప్పారు. అదే విధంగా రైతు సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి, 2023-24 పత్తి సీజన్ కోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 1,718 కోట్ల రూపాయలకు పైగా కనీస మద్దతు ధర (MSP) నిధులను మంత్రివర్గం ఆమోదించిందని అశ్విని వైష్ణవ్ తెలియచేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఒకే దేశం, ఒకే ఎన్నికకు సంబంధించిన చట్టాన్ని పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని 2026 వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు లోకసభ పొడిగించింది. లోకసభకు రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలను ప్రవేశపెట్టడమే ఈ బిల్లు ఉద్దేశం. రాజ్యాంగంలో 129వ సవరణ బిల్లు-2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2024లకు సంబంధించిన సంయుక్త కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని కమిటీ ఛైర్మన్ పి.పి. చౌదరి లోక్ సభలో ఈ రోజు ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటు ద్వారా ఈ తీర్మానం సభ ఆమోదం పొందింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించే విషయంలో కలిసి పని చేయడానికి భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అంగీకరించాయి. తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో.. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో పశ్చిమాసియాలోని పరిస్థితిపై మాట్లాడారని తెలిపారు. యూఏఈపై జరిగిన దాడులను, అమాయకుల ప్రాణనష్టాన్ని, పౌరుల మౌలిక సదుపాయాల నష్టాన్ని నరేంద్ర మోదీ ఖండించారని చెప్పారు. ఈ సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... దేశంలో ముడి చమురు లభ్యత సాధారణంగా ఉందని, రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పని చేస్తున్నాయని తెలిపారు. దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, దేశవ్యాప్తంగా ఏ రిటైల్ అవుట్ లెట్‌లోనూ నిల్వలు అయిపోయినట్లు నివేదికలు లేవని ఆమె స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాణీకులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఏ విమానంలోనైనా కనీసం 60 శాతం సీట్లను ఉచితంగా ఎంపిక చేసుకునేందుకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం విమానయాన సంస్థలను ఆదేశించింది. ఒకే పీఎన్ఆర్ (PNR)పై ప్రయాణించే ప్రయాణీకులు కలిసి ఉండేలా వీలైతే పక్కపక్క సీట్లలో కూర్చోబెట్టేలా చూడాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ముఖ్యంగా ఆలస్యం, రద్దు, బోర్డింగ్ నిరాకరణ వంటి సందర్భాలలో ప్రయాణీకుల హక్కులను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆహార భద్రతను కల్పించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించడం అనే లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

పేర్కొన్నారు. లోక్‌సభలో ఈ రోజు మంత్రి మాట్లాడుతూ... 2013-14లో వ్యవసాయ బడ్జెట్ కేవలం 21 వేల 933 కోట్ల రూపాయలు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది లక్షా 30 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని తెలిపారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర పొందేలా చూడటానికి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే దిశగా అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. "పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి" పథకం కింద ఇప్పటివరకు 22 వాయిదాలుగా 4 లక్షల 27 వేల కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు శివరాజ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

గత మూడేళ్లలో.. దేశంలోని అన్ని జిల్లాల్లోని తపాలా కార్యాలయాలు, మెయిల్ పార్శిల్ ప్రాసెసింగ్ హబ్‌ల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. లోక్‌సభలో అనుబంధ ప్రశ్నలకు ఆయన ఈ రోజు  సమాధానమిస్తూ... ఈ చర్యల వల్ల పార్శిల్ నిర్వహణ సామర్థ్యం పెరిగిందని గుర్తు చేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 9.72 కోట్ల నుండి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14.5 కోట్లకు పార్శిళ్ల సంఖ్య పెరిగిందని వివరించారు. అదే విధంగా తపాలా శాఖ అనేక ప్రధాన ఇ-కామర్స్ సహా ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ వేదికలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి 106.89 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. 2025 జనవరిలో ఈ జోన్‌కు శంకుస్థాపన జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ప్రధాన కార్యాలయ భవన పునాది పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రైల్వే జోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు 9 వేల 417 కోట్ల రూపాయల కేటాయింపులు జరిగాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రాలలో వాణిజ్య ఎల్‌పిజిల కేటాయింపును 20 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో ఈ విషయాన్ని తెలియచేశారు. దీర్ఘకాలంలో ఎల్‌పిజి వినియోగాన్ని తగ్గించడానికి, పిఎన్‌జి వ్యాప్తిని పెంచడానికి వివిధ సంస్కరణలు చేపట్టాలని కూడా ఆయన రాష్ట్రాలకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ప్రకటనల రంగాన్ని ప్రపంచ వ్యాప్తంగా పోటీ పడగల వ్యవస్థగా మార్చేందుకు బాధ్యతాయుతమైన విధానం అవసరమని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన "యాడ్ ట్రస్ట్ సమ్మిట్-2026"లో ఆయన ప్రసంగిస్తూ.. ఈ రంగంలో వేగంగా వస్తున్న డిజిటల్ మార్పులను గమనంలోకి తీసుకుంటూనే.. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత మోసాల వల్ల పెరుగుతున్న ముప్పు గురించి కూడా తెలుసుకోవాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =